క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేఎస్ఆర్ గార్డెన్, ఐశ్వర్య గార్డెన్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, కాకతీయ కాలనీ, ఉజిలీబేస్, కాపువాడ, గాంధీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, సుబేదారి ఈడెన్ గార్డెన్ ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

రేపు పూర్వ విద్యార్థుల సమావేశం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 15, 16వ తేదీల్లో న్యాక్ పీర్‌కమిటీ బృందం రానుంది. ఈమేరకు ఈనెల 15న ఉదయం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. వివరాలకు పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి వినోద్‌రావు (99663 43468)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కాజీపేట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో ఇటీవల జరిగిన నృత్య పోటీల్లో కాజీపేట తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు అశ్రిత, అనుజ్ఞ పాల్గొని ప్రతిభను కనబరిచి అవార్డులు అందుకున్నారు. నాట్య గురువు కళాశారద పర్యవేక్షణలో కాశీ విశ్వనాథుడికి నృత్య పుష్పాంజలి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈమేరకు వారణాసి ఎమ్మెల్యే శ్రీవాత్సవ చేతుల మీదుగా మహదేవుడి అవార్డు ఇద్దరు విద్యార్థులు అందుకున్నారు. కాగా, పాఠశాలలో అశ్రిత, అనుజ్ఞను విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, తాళ్ల వంశీ, చైతన్య సోమవారం సన్మానించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 65 మంది 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను మడికొండ లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మామిడాల రాజేంద్రం, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ కె.బాలకృష్ణ, ఎన్.అమర్‌నాథ్, రాజేందర్, పి.శ్రీనివాస్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

అభాగ్యులకు దుప్పట్ల అందజేత

వరంగల్ చౌరస్తా: రహదారుల్లో చలికి వణుకుతున్న వరంగల్ చౌరస్తా నుంచి స్టేషన్‌రోడ్డులో సుమారు 15మంది అభాగ్యులకు రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, బ్రహ్మశ్రీ మల్లిపెద్ది కృష్ణశాస్త్రి, ఆర్గనైజర్ శ్రవణ్, తంగిశెట్టి సందీప్, సిహెచ్.రమేష్, దివ్యశ్రీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన క్రైమ్ డీసీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన క్రైమ్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన డి.మురళీధర్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పూలమొక్క అందజేశారు.

కాజీపేటలో మహిళ అదృశ్యం

కాజీపేట రూరల్: కాజీపేట విష్ణుపురి ప్రాంతానికి చెందిన మహిళ అదృశ్యమైందని కాజీపేట ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. గండికోట కళ – సారంగపాణి దంపతుల కుమార్తె భారతిదేవి (25) టైలరింగ్ పని చేస్తోంది. ఫిబ్రవరి 10న బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు.

భట్రాజుల జిల్లా సంఘం ఎన్నిక

కాశిబుగ్గ: తెలంగాణ రాష్ట్ర భట్రాజుల సంఘం వరంగల్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని కాశిబుగ్గలోని స్టాండర్డ్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోనుగంటి దయాకర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కాంచనపల్లి శ్రీనివాసరాజు, కోశాధికారిగా కారంపూడి సుజయ్‌రాజు, ఉపాధ్యక్షులుగా తుమిడి సురేష్‌రాజు, పాండురంగ విఠల్‌రాజు, రాజు, కాంచనపల్లి వనజరాణి, ప్రచార కార్యదర్శులుగా బిరుదరాజు, మాధవరాజు, సహాయ కార్యదర్శులుగా కాంచనపల్లి సరోత్తంరాజు, నగధర్‌రాజు, ఏవీజీ.రాజు, ఓంకారం, వనతి, మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సీవీ.జయవీర్ రాజు, పరిశీలకులు సురేందర్‌రాజు తెలిపారు.

వాసవి క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

రామన్నపేట: రామన్నపేట ఏవీఎస్ కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ వాసవి క్లబ్ కేసీజీఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా డాక్టర్ సోమ శ్రీధర్, కార్యదర్శిగా నరేష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జోన్‌చైర్మన్‌గా డాక్టర్ సుధీర్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, వాసవి క్లబ్ గవర్నర్ రవ్వ గీత, రీజినల్ చైర్మన్ వల్లాల పృథ్వీరాజ్, డాక్టర్ నరసింహరావు, రాకేష్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, దిలీప్, దినేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న పేద వైద్య విద్యార్థికి రూ.4 వేలు అందించారు.

అదానీ కుంభకోణంపై విచారణ జరిపించాలి


హన్మకొండ: నక్కలగుట్టలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు


వరంగల్ చౌరస్తా: ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు


ఖిలా వరంగల్: ఫోర్ట్‌రోడ్డులో నిరసన తెలుపుతున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

హన్మకొండ: ప్రధాని నరేంద్రమోదీ అండతోనే బడా పెట్టుబడిదారు గౌతమ్ అదానీ ప్రపంచంలోనే రెండవ కుబేరుడిగా ఎదిగారని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ విమర్శించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీని కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్‌బీఐ బ్రాంచీ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన పెట్టుబడులు లేకుండా సట్టా వ్యాపారం (స్టాక్ మార్కెట్) ద్వారా నిర్మించిన అదానీ సామ్రాజ్యం హిండెన్ బర్గ్ నివేదిక విడుదలతో గుట్టంత బయటపడిందని అన్నారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, నాయకులు కండే నరసయ్య, శనిగరపు రాజకుమార్, పబ్బు రవి, పూజారి అమృతయ్య, రాంగోపాలచారి, మనోహర్ పాల్గొన్నారు.

జేపీఎన్ రోడ్డులో..

వరంగల్ చౌరస్తా: బడా కార్పొరేట్ గౌతమ్ అదాని కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి ప్రధాని మోదీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ సూచించారు. సీపీఐ వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో జేపీఎన్ రోడ్డులోని ఎస్‌బీఐ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని రూ.10 లక్షల కోట్ల ప్రజాధనాన్ని అక్రమంగా దోచుకున్న అదానిని మోదీ కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కుంభకోణంపై విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంద్ర కుమార్, జన్ను రవి, పరికిరాల రమేష్, లావుడ్యా దస్రునాయక్, బూజుగుండ్ల రమేష్, మంద ఐలయ్య, మస్క సుధీర్, వలబోజు వెంకన్న, బచ్చల స్వప్న, సుప్రియ పాల్గొన్నారు.

వరంగల్ ఇసుక అడ్డా జంక్షన్‌లో..

ఖిలా వరంగల్: బడా కార్పొరేట్ గౌతమ్ అదానీ కుంభకోణంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఇసుక అడ్డా జంక్షన్ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి కార్పొరేట్ దిగ్గజం అదానీకి ప్రధాని మోదీ కొమ్ముకాస్తూ దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, ఎలేందర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం దాసోహం

కాశిబుగ్గ: పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచించారు. శివనగర్, చింతల్, రైల్వేగేట్ పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు, ప్రశ్నాపత్రాలపై హెచ్ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సబ్జెక్టుల టీచర్లు ప్రశ్నాపత్రం, పరీక్షల సరళిపై అవగాహన కల్పించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.


పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, ఎస్.శ్రీనివాస్, జి.వేణు, టి.సత్యనారాయణ, కృష్ణ, రవిందర్, ఉపేందర్, లావణ్య, భిక్షపతి, అంజయ్య, కవిత, ధనలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని దోపిడీ చేసి దేశంపై పడ్డారు


మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

హసన్‌పర్తి: టీఆర్ఎస్ పార్టీతో తెలంగాణ రాష్ట్రాన్ని దోపిడీ చేసిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు బీఆర్ఎస్ పేరుతో దేశాన్ని లూటీ చేయడానికి వెళ్తున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ పేదరాష్ట్రంగా మార్చారని ఎద్దేవాచేశారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఈనెల 16న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వర్ధన్నపేటలో పర్యటించనున్నట్లు శ్రీనివాస్ వెల్లడించారు. సమావేశంలో మహేందర్‌రెడ్డి, తిరుపతి, చిర్ర సుమలత, పొన్నాల రఘు, చరణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి ఆరెకుల 'చలో హైదరాబాద్' రద్దు

నయీంనగర్: ఈనెల 15వ తేదీన హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న ఆరెకుల భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం, ఆరెకుల సభను విజయవంతం చేయడానికి చేపట్టిన ఆరెకుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆరెకుల స్టీరింగ్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి కిషన్‌రావు తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, బీసీ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వివరించారు. మరో తేదీని త్వరలో వెల్లడించనున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు జెండా అంబయ్య, సోమిడి శ్రీనివాస్, లింగంపల్లి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లింగంపల్లి కిషన్‌రావు

'ఎమ్మెల్యే నరేందర్‌కు సంపాదనపైనే దృష్టి'

రామన్నపేట: తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్.. అభివృద్ధిని విస్మరించి, సంపాదనపైనే దృష్టి సారించారని మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నగరంలోని 25వ డివిజన్ మహంకాళి గుడి, మండిబజార్ ప్రాంతాల్లో సురేఖ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. తూర్పులో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఇప్పుడేం అభివృద్ధి జరగలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మీసాల ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన పనులను పూర్తిచేయాలి


పాఠశాలను సందర్శించిన ఏఈ అజీజ్‌ఖాన్

హసన్‌పర్తి: పెగడపల్లిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదేశించారు. ఐదేళ్ల క్రితం అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరయ్యాయి. ఈక్రమంలో పలు ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి. అయితే, సాంకేతిక కారణాల వల్ల నిధులు నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని పనులను సదరు కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేశాడు. ఆ జాబితాలో పెగడపల్లి పాఠశాల భవనం కూడా ఉంది. ఈమేరకు మధ్యలో నిలిచిపోయిన పాఠశాలలోని పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. దాంతో అధికారులు పాఠశాలను సందర్శించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

హన్మకొండ: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని 51వ డివిజన్ కార్పొరేటర్ బోయినిపల్లి రంజిత్‌రావు సూచించారు. హనుమకొండ హౌసింగ్‌బోర్డులోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల సౌకర్యార్థం ఇక్కడ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాలిక, డాక్టర్ హరిత, సిబ్బంది అనూష, సరోజ, యుమా, వసంత, విజయలక్ష్మి, స్వరూప, ఉమ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజు, నాయకులు లత, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.


కంటి పరీక్షలను పరిశీలిస్తున్న రంజిత్‌రావు

దర్గాను సందర్శించిన డీసీపీ

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని హజ్రత్ మాషూక్ రబ్బానీ (రహమతుల్లా అలై) దర్గా 467వ ఉర్సు ఉత్సవాలు సోమవారం తెల్లవారు జామున ప్రారంభమయ్యాయి. 13, 14, 15 తేదీల్లో జరగనున్న మషూక్ రబ్బానీ ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాను సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ సోమవారం సందర్శించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం, ఏసీపీ బోనాల కిషన్, దర్గా పీఠాధిపతులతో కలిసి డీసీపీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న డీసీపీ భారీ

కేఏ.పాల్ చిత్రపటానికి పాలాభిషేకం


పాల్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: తెలంగాణ నూతన సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరు పెట్టారు. అయితే, సచివాలయాన్ని తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17న ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకంగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్ ఫిర్యాదు మేరకు కేంద్ర న్యాయశాఖమంత్రి.. కోర్టు ద్వారా ప్రారంభోత్సవాన్ని నిలిపివేయించారు. ఈమేరకు కేయూలోని పలువురు విద్యార్థులు యూనివర్సిటీ గేట్‌వద్ద కేఏ.పాల్ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రమేష్, సురేష్, అజయ్, విలాస్, రాజు, సతీష్, రవీందర్, సంజు, కళ్యాణ్, ఉపేందర్, మల్లేష్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు అభినందన

కేయూ క్యాంపస్: కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ యూనివర్సిటీలో ఈనెల 3నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం కేడెట్లు (ఎన్ఎస్ఎస్ వలంటీర్లు) పాల్గొని అవార్డులు సాధించినట్లు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ తెలిపారు. ఈ మేరకు గ్రూప్ సాంగ్, షోలో సాంగ్‌లో ప్రతిభ చూపి ప్రశంసపత్రాలు పొందారని వివరించారు. ఈమేరకు విజేతలను కాకతీయ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, ప్రొఫెసర్లు, తదితరులు సోమవారం అభినందించారు.

సంక్షిప్తంగా

పౌల్ట్రీఫాంను జనావాసాల నుంచి తరలించాలి

హన్మకొండ అర్బన్: 56వ డివిజన్ పరిమళ కాలనీలో జనావాసాల మధ్య ఉన్న పౌల్ట్రీఫాంను అక్కడి నుంచి వెంటనే తొలగించాలని అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 40 ఏళ్ల క్రితం జనావాసాలకు దూరంగా ఇక్కడ పౌల్ట్రీఫాం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చామల రమేష్, తక్కళ్లపల్లి అమృతరావు, ఉపాధ్యక్షులు గంగుల రాజిరెడ్డి, సహాయ కార్యదర్శి భద్రునాయక్, కోశాధికారి యాకయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల పట్ల కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ ఆరోపించారు. ఏఐఆర్ఎఫ్, ఎస్‌సీఆర్ఎంయూ పిలుపు మేరకు కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మూకుమ్మడి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు.

కరాటేలో రాణించిన విద్యార్థులు

మడికొండ: న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఇండోర్ స్టేడియం నిర్వహించిన సెకండ్ ఇంటర్ నేషనల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో మడికొండ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనరిచారు. మొదటి బహుమతిని యశ్వంత్, హర్షవర్ధన్, మనిస్వామి, దీపక్, చరణ్, సాయిరెడ్డి, రెండో బహుమతి వర్షిని, దైవతేజ, మూడో బహుమతి యగ్నేష్, మేఘన, మాధవన్ అందుకున్నారని కోచ్ రామకృష్ణ తెలిపారు. ఈమేరకు వారిని పలువురు సోమవారం అభినందించారు.

19న వీరశివాజీ శోభాయాత్ర

నయీంనగర్: ఈనెల 19వ తేదీన శివాజీ జయంతిని పురస్కరించుకొని వీరశివాజీ శోభాయాత్ర (బైక్ ర్యాలీ) నిర్వహించనున్నట్లు హిందూవాహిని వరంగల్ జిల్లా అధ్యక్షుడు రూపిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శోభాయాత్ర గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కడిపికొండ బ్రిడ్జి చౌరస్తాలో సాయంత్రం 4గంటలకు యాత్ర ప్రారంభమై కాజీపేట, హనుమకొండ ప్రధాన రహదారి వెంట సాగుతూ హనుమకొండ చౌరస్తా చేరుకొని అక్కడ జరగనున్న సభతో ముగుస్తుందని వివరించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

హన్మకొండ: సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా ఉద్యమిద్దామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి బక్క దానయ్య, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో అసోసియేషన్ హనుమకొండ జిల్లా సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎస్.కుమారస్వామి, జిల్లా కార్యదర్శి వస్కుల కృష్ణ, ఉపాధ్యక్షుడు చలపతి, నాయకులు శ్యాం కుమార్, వినోద్ కుమార్, విజయ్, రాజు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట హుండీ ఆదాయం లెక్కింపు

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి హుండీని అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. తొమ్మిది నెలల తర్వాత శివాలయం హుండీ ద్వారా రూ.2,53,950 ఆదాయం రాగా, రామాలయం హుండీ నుంచి రూ.72,579 వచ్చిందని కార్యనిర్వాహణాధికారి శేషభారతి తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ దేవాదాయ, ధర్మదాయశాఖ అధికారి సంజీవరెడ్డి, ఆలయ చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు ఓర్సు రాజు, పెద్ది ప్రభాకర్, బుర్ర సంధ్యారాణి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది భాస్కర్, వెంకటేశ్వరస్వామి సేవాసమితి సభ్యులు, భక్తులు వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు జర్నలిస్టుల సహకారం ఉండాలి

నయీంనగర్: ఉద్యోగులకు జర్నలిస్టుల సహకారం ఎల్లప్పుడు ఉండాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రాంకిషన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీని సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, నాయకులు హేమానాయక్, వెంకటేశ్వర్లు, రాజు, చందర్‌రావు, దుర్గారావు, ప్రెస్ క్లబ్ సెక్రటరీ బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, సభ్యులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి

ఖిలా వరంగల్: దళితులకు రక్షణ కల్పిస్తూ దాడులకు తెగపడేవారిపై శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్ కోరారు. ఈమేరకు తహసీల్దార్ ఫణికుమార్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలని కోరారు. దళిత బంధు పథకాన్ని ప్రతి పేదకుటుంబానికి వర్తింపజేయాలని, దళితులకు మూడు ఎకరాల భూమిని పంపిణీని చేయాలని సూచించారు.

తేనెతో శ్వేతార్కుడికి ప్రత్యేక అభిషేకం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి తేనెతో సోమవారం అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన తేనెతో అర్చకులు అభిషేకం జరిపించారు. ఆలయ వ్యవస్థాపకుడు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

వరంగల్ రూరల్: ప్రతి ఒక్కరు ఖర్చులు తగ్గించుకొని పొదుపు చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు–2023ను పురస్కరించుకుని లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు కిలోమీటర్ల వాకథాన్‌ను నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ఏకశిల పార్కు వరకు కొనసాగిన వాకథాన్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ గోపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 17 వరకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా ఆర్థిక అక్షరాస్యత క్యాంపులు వివిధ గ్రామ పంచాయతీలు, మున్సిపల్ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఆర్థిక మోసాలకు గురైన వారు 1930, 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని ఆయన సూచించారు.

శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో 18వ తేదీ నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, వీఐపీల దర్శనం, ధర్మ దర్శనం క్యూలైన్లను పరిశీలించారు. కార్యక్రమంలో మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్సైలు నర్సింహరావు, దివ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ దువ్వ నవీన్, నాయకులు వినోద్, శ్రీకాంత్, అర్చకులు అభిలాష్‌శర్మ, సత్యనారాయణ శర్మ, విష్ణువర్ధనాచార్యులు పాల్గొన్నారు.


మడికొండ: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ

కాశీ విశ్వేశ్వరాలయంలో ఉత్సవాలు ప్రారంభం

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని చారిత్రక కాశీ విశ్వేశ్వరాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఎస్సై నాగరాజు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్‌తో కలిసి ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.

పనులు తక్కువ.. ప్రచారం ఎక్కువ

వరంగల్ చౌరస్తా: తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేసే అభివృద్ధి పనులు తక్కువ, ప్రచారం మాత్రం చాలా ఎక్కువని బీజేపీ నాయకుడు వన్నాల వెంకటరమణ విమర్శించారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కునుకుంట్ల రంజిత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రోడ్డు కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నరేందర్‌ల మధ్య సయోధ్య లేక నగరాభివృద్ధి కుంటుపడుతోందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కుసుమ సతీష్, అచ్చ విద్యాసాగర్, ఎరబెల్లి ప్రదీప్‌రావు, సముద్రాల పరమేశ్వర్ డివిజన్ అధ్యక్షులు పవన్, బండి సుజాత, జిల్లా అధికార ప్రతినిధి మార్టిన్ లూథర్, బాకం హరిశంకర్, కార్నర్ మీటింగ్ ఇన్‌చార్జ్ గొక వెంకట్, తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

విముక్తి పొందితేనే అభివృద్ధి సాధ్యం

రామన్నపేట: కుటుంబ పాలన నుంచి విముక్తి పొందితేనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకుడు అచ్చ విద్యాసాగర్ పేర్కొన్నారు. 25వ డివిజన్ వేణురావుకాలనీలో నాయకుడు ఆకారపు మోహన్ ఆధ్వర్యంలో సోమవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, సముద్రాల పరమేశ్వర్, రత్నం సతీష్‌షా, కుసుమ సతీష్ పాల్గొన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో 'అమృత్ మహోత్సవ్'

కాజీపేట రూరల్: అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్స్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం రైల్వే ఉద్యోగుల పిల్లలు, చిన్నారులు, మహిళా కళాకారులు పాల్గొని భరతనాట్యం, కూచిపుడి, జానపద నృత్యాలు చేశారు. దేశభక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కళాకారులు వెన్నెల, హాస్య, సనాయి కృతి, కనిష్కసాయి, కె.రమాదేవి, పాయల్‌చటర్జీ, చటర్జీ, కల్పిత, పరిణిత, సుష్మిత, అమిత్ భాస్కర్, రేణు, షణ్ముకసాయి, రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎం.రాజయ్య, జి.రాజేశ్వర్‌రావు, ధరావత్ రఘు, పి.ప్రశాంత్, ఎస్.ప్రవీణ్, ఎస్.ఆర్.ప్రశాంత్, బి.మాధవరావు, పి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాకారులు

18న శివరాత్రి సాంస్కృతిక వేడుకలు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వరంగల్ చౌరస్తా: ప్రతీఏడాది తరహాలోనే ఈసారి కూడా మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఫిబ్రవరి 18న హనుమకొండ హయగ్రీవాచారి మైదానంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తెలిపారు. శివరాత్రి పర్వదిన వేడుకల వాల్ పోస్టర్లను వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాకేష్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మేళనంలో బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ ప్రవచనం, ప్రముఖ రచయిత, ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన విజయేంద్ర ప్రసాద్ సందేశం, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రసంగం, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.